

లక్కవరంలో కోవిడ్ కేసు నమోదు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరంలో కోవిడ్ కేసు నమోదైందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం జలుబు, దగ్గు జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన ఓ వ్యక్తికి కోవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఇటీవల లక్కవరం ఎస్‌టి కాలనీకి చెందిన ఓ వ్యక్తి తాపీ పనుల నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్లి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో అతనికి అనారోగ్యం లక్షణాలుండటంతో ఆసుపత్రిని సంప్రదించాడని తెలిపారు. దీంతో అప్రమత్తమైన పంచాయతీ సెక్రటరీ పగడం నాగేశ్వరరావు ఆ వ్యక్తి ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్ వెదజల్లించారు. అయినప్పటికీ కచ్చితమైన నిర్ధారణ కోసం మరికొన్ని పరీక్షలు నిర్వహించడానికి నమూనాలను ల్యాబ్‌కు పంపామని డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.

ఎస్‌పి మేడం.. మా బాధలు చూడండి..!



20 ఏళ్ల తర్వాత మహిళా ఎస్‌పిగా మేరీ ప్రశాంతి
తమగోడు వినాలని సచివాలయ మహిళా పోలీసుల ఆవేదన
నిబంధనలకు విరుద్ధంగా విధులతో నరకయాతన
అర్ధరాత్రులు, పండుగల్లోనూ బాధ్యతలు
జిఒ 59ను ఉపసంహరించుకున్నా మారని స్టేషన్ అధికారుల తీరు
మహిళా ఎస్‌పిగా తమ సమస్యలు పరిష్కరిస్తారని అంతా ఆశలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఎస్‌పి మేడం.. ఒక్కసారి మా బాధలు చూడండి' అంటూ సచివాలయ మహిళా పోలీసులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.మేరీప్రశాంతిని వేడుకుంటున్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత జిల్లా ఎస్‌పిగా ఓ మహిళా అధికారి బాధ్యతలు చేపట్టడంపై ప్రజల్లోనూ, పోలీస్ సిబ్బందిలోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహిళల పట్ల జరిగే ఘటనలు, సమస్యలకు అధిక ప్రాధాన్యతిస్తామని తెలిపారు. దీంతో విధులపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సచివాలయ మహిళా పోలీసులు తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 938 గ్రామ, 207 వార్డు మొత్తం 1165 సచివాలయాలున్నాయి. ప్రతిసచివాలయంలోనూ మహిళా పోలీస్‌గా ఉన్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం వీరికి జాబ్‌ఛార్ట్‌లో కేటాయించిన విధులకు, ప్రస్తుతం వీరు చేస్తున్న పనికి ఏమాత్రమూ సంబంధం లేకుండా పోయింది. గ్రామసంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా మార్పుచేసేందుకు ప్రభుత్వం జిఒ 59ను తీసుకొచ్చింది. పోలీస్ ఉద్యోగాల నియామక నిబంధనల ప్రకారం ఇది పూర్తి విరుద్ధమని కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ఫిజికల్ పరీక్షల్లో పాస్‌కాకుండా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా ఏవిధంగా నియమిస్తారంటూ కోర్టులో వాదనలు సైతం నడిచాయి. దీంతో 59 జిఒను ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. మహిళా పోలీసులకు బందోబస్తు వంటి విధులు వేయాలని కోర్టుకు అఫిడవిట్ రూపంలో సమర్పించడమూ జరిగింది. ఈ జిఒను ఉపసంహరించుకున్నా స్టేషన్ అధికారులు మాత్రం నిబంధలనకు విరుద్ధంగా మహిళా పోలీసులకు విధులు కేటాయిస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే పలుచోట్ల స్టేషన్ అధికారులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నట్లు మహిళా పోలీసులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం మహిళా పోలీసులు గ్రామ సచివాలయ పరిధిలో నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌లకు ఇవ్వడం, మహిళలకు సంబంధించిన కేసులు సచివాలయ పరిధిలో జరిగితే హాజరుకావడం, సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడం, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు, తమ పరిధిలోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం వంటివి చేయాల్సి ఉంది. సచివాలయంలో పనిచేసే 11 శాఖల ఉద్యోగులకు వర్తించే నిబంధనలు మాత్రమే వీరికి వర్తిస్తాయి. పోలీస్‌శాఖకు సంబంధించిన నిబంధనలు వీరికి వర్తించవు. మహిళా పోలీసులకు బందోబస్తు, అర్ధరాత్రి వరకూ విధులు, సెలవు, పండుగ రోజుల్లో విధులు కేటాయించడం అనేది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. అందుకు విరుద్ధంగా వీరికి పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ విధులు, 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహిళా పోలీసులను సిఎం బందోబస్తుకు, ఉద్యోగరాత పరీక్ష కేంద్రాల వద్ద విధులు, అర్ధరాత్రి వరకూ విధులు వేస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల కేసు ఫైల్స్ రాసే బాధ్యతను కూడా మహిళా పోలీసులకే అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. తమ జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా విధులు నిర్వహించలేక మహిళా పోలీసులు నరకయాతన అనుభవిస్తున్నారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

ఎస్‌పిగా మహిళా అధికారి రావడంతో ఆశలు

ఏలూరు జిల్లా పోలీస్‌బాస్‌గా మహిళా అధికారి రావడంతో జిల్లాలో పనిచేసే మహిళా పోలీసుల్లో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారమే మహిళా పోలీసులకు విధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వారంతా వేడుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో ఇది అమలైతే ప్రభుత్వానికి సైతం మంచి పేరు వచ్చే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గ్రామసచివాలయ ఉద్యోగ నిబంధనల ప్రకారం మహిళా పోలీసులకు విధులు అమలయ్యేలా చర్యలు తీసుకుంటే ఎంతోమంది మహిళా పోలీసులకు మహిళా అధికారిగా ఊరట కలిగించిన పరిస్థితి ఉంటుంది.

అందరి మదిలోనూ నాటి సంఘటన

జిల్లా ఎస్‌పిగా బాధ్యలు చేపట్టిన మేరీప్రశాంతికి మంచి పోలీస్ అధికారిగా పేరుంది. ఆమె ట్రైనీ డిఎస్‌పిగా ప్రస్తుతం ఉన్న ఏలూరు జిల్లాలోనే పనిచేశారు. ఆమె పనిచేసిన కాలంలో జరిగిన ఘటనలు అందరూ గుర్తుచేసుకుంటున్నారు. ఆమె డిఎస్‌పి శిక్షణలో భాగంగా ఏలూరు టూ టౌన్‌లో పనిచేశారు. అదే సమయంలో అక్కడి సిఐ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ బాధ్యతలను కూడా ఆమె చూసేవారు. మంచి అధికారిగా పేరు సైతం తెచ్చుకున్నారు. కొద్దిరోజుల తర్వాత సిఐగా మరో అధికారిని నియమించారు. తన కుర్చీలో శిక్షణ డిఎస్‌పిగా ఉన్న మేరీప్రశాంతి కూర్చోవడాన్ని ఆయన సహించలేకపోయారు. ఆమెను ఏమాత్రమూ సంప్రదించకుండా తన రాజకీయ పలుకుబడిని ప్రయోగించి ఆమెను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె ఏ మాత్రమూ తగ్గకుండా గట్టిగా నిలబడ్డారు. ఇప్పుడు ఎస్‌పిగా మేరీప్రశాంతి రావడంతో అప్పటి పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. మహిళా అధికారిగా నాడు ఆమె చూపిన ధైర్యం, తెగువ ఎంతోమంది మహిళా అధికారులకు స్ఫూర్తిగా నిలిచింది. ఎస్‌పిగా మహిళలు, మహిళా సిబ్బంది సమస్యపై మరింత దీష్టిసారించాలని అంతా కోరుతున్నారు.



జాతీయ రహదారిపై అడ్డంగా పడుకుని ఆందోళన చేస్తున్న యువకుడు

యువకుడి మృతిపై ఆగ్రహం

మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో
మూడు గంటల పాటు ఉద్రిక్తత
స్తంభించిన ట్రాఫిక్
గ్రామస్తులపై, దళితులపై లాఠీచార్జి
డిమాండ్ల పరిష్కారానికి అధికారుల హామీ

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని గరుడ హోటల్ సమీపంలో ఈనెల తొమ్మిదో తేదీరాత్రి రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన కడిమే సతీష్(22) పరిస్థితి విషమించి బుధవారం మతిచెందడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారంటూ ఆందోళనకు దిగారు. ఆందోళన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు గ్రామస్తులపై లాఠీచార్జికి దిగారు. ఈ క్రమంలో పలువురు గాయపడ్డారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని కొమిరేపల్లి గ్రామానికి చెందిన కడిమే రాంబాబుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కడిమే సతీష్ ఉన్నారు. కొడుకు వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబానికి జీవనాధారంగా ఉన్నాడు. ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి గుండుగొలను వెళ్లేందుకు గరుడ హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గేదెలు అడ్డురావడంతో అతని ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో సతీష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. రూ.60 వేలు ఖర్చయినప్పటికీ ఎలాంటి ప్రయోజనమూ లేకుండాపోయింది. అక్కడ నుంచి ఏలూరు జిల్లాకేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందాడు. అయితే కొమిరేపల్లి గ్రామ బైపాస్ రోడ్డు దాటేందుకు మార్గం లేకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి ఆధారంగా ఉన్న యువకుడు మృత్యువాత పడటంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగినా హైవే అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో, లాఠీ ఛార్జి

తమ గ్రామానికి జాతీయ రహదారిపై నుంచి రాకపోకలు సాగించాలంటే మృత్యువుతో పోరాటం చేయాల్సి వస్తుందని, అర కిలోమీటర్ పైనే రాంగ్ రూటులో వెళ్లాల్సి వస్తోందని కొమిరేపల్లి గ్రామస్తులు మృతదేహంతో రాస్తారోకో చేపట్టారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్పందించి గ్రామస్తులకు సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మృతునికుటంబానికి న్యాయం చేయాలని కోరుతూ బంధువులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై సుమారు మూడు గంటలపాటు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఏలూరు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ దెందులూరు మండల వైసిపి నాయకులు కె.నాని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు డిఎస్‌పి సమాచారం అందించారు. వారి సూచనల మేరకు ఆందోళనకారులతో చర్చించారు. మృతుని కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, కొమిరేపల్లి గ్రామస్తులకు పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు త్వరగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ గ్రామస్తులు వినకపోవడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఎట్టకేలకు అగంతం తర్వాత పోలీసులు వారిని చెదరగొట్టడంతో ఆందోళన సద్దుమణిగింది. ఆందోళనకారుల డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. దళిత నాయకులతో కలిసి జిల్లా ఎస్‌పికి, కలెక్టర్‌కు దళితులపై జరిగిన లాఠీఛార్జిపై గురువారం ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు : ఎస్‌పి

బాధ్యతలు చేపట్టిన ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మొట్టమొదటి మహిళా ఎస్‌పిగా మేరీ ప్రశాంతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా చర్యలు చేపడతానని చెప్పారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. చట్టపరిధిలో పని చేసుకుంటూ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు.

ఏలూరు : జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన దాసరి మేరీ ప్రశాంతి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సమయంలో జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన అంశాల గురించి కలెక్టర్, ఎస్పీ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి. మేరీ ప్రశాంతికి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

13,806 మందికి ఇబిసి నేస్తం లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

వైఎస్ఆర్ ఇబిసి నేస్తం రెండో విడత కింద జిల్లాలో 13,806 మంది అగ్రవర్ణ పేద మహిళల ఖాతాల్లోకి రూ.20.71 కోట్లు జమ చేశారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఇబిసి నేస్తంలో రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఒసి సామాజిక తరగతులకు చెందిన అర్హులైన 4,39,068 మంది పేదలకు రూ.658.60 కోట్ల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే బృహత్తర కార్యక్రమాన్ని బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సిఎం జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, పలువురు లబ్ధిదారులు తిలకించారు. అనంతరం జిల్లాలోని సంబంధిత లబ్ధిదారులకు డెమో చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇబిసి నేస్తంలో మూడు విడతలుగా రూ.15 వేలు వంతున రూ.45 వేలు ఆర్థిక సహాయం అందించడంలో భాగంగా కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు మిగిలిన ఒసి సామాజిక తరగతికి చెందిన 45 ఏళ్ల నుంచి 60ఏళ్ల వరకూ గల నిరుపేద మహిళలకు రూ.15 వేలు చొప్పున రెండో విడత నిధులు విడుదలయ్యాయన్నారు. ఏలూరు జిల్లాలో 13,806 మందికి రూ.20.71 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 2,092 లబ్ధిదారులకు రూ.3.14 కోట్లు, నూజివీడులో 2,374 మందికి రూ.3.56 కోట్లు, చింతలపూడిలో 2,867 మందికి రూ.4.30 కోట్లు, ఏలూరులో 1,046 మందికి రూ.1.57 కోట్లు, పోలవరంలో 1,876 మందికి రూ.2.81 కోట్లు, కైకలూరులో 1,704 మందికి రూ.2.56 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 1,847 మందికి రూ.2.77 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమయినట్లు కలెక్టర్ తెలిపారు.

మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

డిఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో నాటుసారా, గంజాయి మాదకద్రవ్యాల రవాణా, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతానని డిఐజి అశోక్‌కుమార్ తెలిపారు. నగరంలోని రేంజ్ కార్యాలయంలో రేంజ్ డిఐజిగా అశోక్‌కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఐజి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల భద్రత కోసం చేపట్టిన దిశ యాప్‌పై రేంజ్ వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఐపిఎల్ బెట్టింగులకు యువకుడు బలి

ప్రజాశక్తి - చాట్రాయి

ఐపిఎల్ బెట్టింగులకు పాల్పడి అప్పుల ఊబిలో కూరుకుపోయిన యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. మండలంలోని జనార్ధనవరం గ్రామానికి చెందిన పామర్తి వీరయ్య కుమారుడు శ్రీకాంత్ (20) ఐపిఎల్ మ్యాచ్ బెట్టింగ్‌లు ఆడి రూ.ఆరు లక్షలకు పైగా అప్పులపాలయ్యాడు. దీంతో బాకీదారుల ఒత్తిడి తట్టుకోలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



అభివాదం చేస్తున్న నేతలు

ప్రచారభేరి యాత్రలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈనెల 14 నుండి 30వ తేదీ వరకూ ప్రచార బేరి యాత్రలు జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పిలుపునిచ్చాయి. బుధవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల ప్రచార భేరి యాత్రల సన్నాహ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాడిస రాము అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేయడం, రోజురోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ పేద ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారన్నారు. అందానీ, అంబానీలకు ప్రభుత్వ ఆస్తులను అప్పగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తానని చెప్పిన మోడీ, తెస్తానని చెప్పిన జగన్ దున్నపోతు మీద వాన కురిసినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారి స్వార్థప్రయోజనాల కోసం ప్రజల గొంతు నొక్కుతు భారాలు వేస్తున్నారని దుయ్యబట్టారు.

ఇప్పటికే దేశంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకికత్వానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ప్రజల్లోకి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రచారయాత్రలు సాగుతాయని తెలిపారు. ఈ యాత్రలను కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, అందుగుల ఫ్రాన్సిస్, పి.దుర్గారావు, జి.వెంకటరావు, వై.నాగేంద్ర, టి.సత్యనారాయణ, బి.రాంబాబు, సిపిఐ జిల్లా నాయకులు రమణరాజు, జమి శ్రీనివాస్, బాడిస రాజు, గంగరాజు, బాలఏసు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయకులపై తప్పుడు కేసులు తగవు

ఆదివాసీ సేన లీగల్ అడ్వైజర్ రవి

ప్రజాశక్తి - కుక్కునూరు

బోయ వాల్మీకి కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేసిన ఆదివాసీ సంఘాల నాయకులపై తప్పుడు కేసులు పెట్టి నిర్బంధాలకు గురిచేయడం తగదని ఆదివాసీ సేన నాయకులు, లీగల్ అడ్వైజర్ రవి హెచ్చరించారు. అమరవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆదివాసీ సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో తోటి ఆదివాసి సంఘాల నాయకులను, ఉద్యోగస్తులను పోలీసులు విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఇటీవల కాలంలో ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాలో ఉన్న అమాయక ఆదివాసీలు, సంఘ నాయకులు, ఉద్యోగస్తులు, విద్యార్థుల మీద ఎమ్మెల్యేలు తప్పుడు కేసులు పెడుతూ ఉద్యమాలను అణచటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని రవి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు కుంచ ప్రసాద్, నాయకులు పూసం ప్రభాకర్, ఆదివాసీ సేన మండల అధ్యక్షులు మడకం మారయ్య, రమణయ్య, బాలరాజు, నాగేష్ చొక్కాయ్య పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహన సేవలు ఉచితమే

సేవలు ప్రారంభించిన ఎంపీ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు టౌన్ :ప్రభుత్వ ఆసుపత్రుల్లో వివిధ వ్యాధులతో ఆసుపత్రుల్లో చేరి దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను వారి సొంత గృహాలకు ఉచితంగా తరలించడా నికి ఎంపి నిధులు రూ.24.60 లక్షలతో సమకూర్చిన మూడు మహా ప్రస్థాన వాహనాలను ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరణించిన వ్యక్తుల కుటుంబ ఆర్థిక కష్టాలను తగ్గించడానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మంచి ఆలోచనతో ఇచ్చిన సూచన మేరకు మహాప్రస్థాన వాహనాలు సమకూర్చినట్లు చెప్పారు. ఈ వాహనాలు జిల్లాలోని నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఏరియా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఏరియా ఆసుపత్రుల పరిధిలోని పిహెచ్‌సిల్లో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి మృతదేహాన్ని వారి సొంత గృహాలకు చేర్చడానికి ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయని ఎంపి తెలిపారు. ఈ సేవలు నిరుపేద మధ్య తరగతి వారికి అందుబాటులో ఉంటాయన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ తమ ఎంపి నిధుల నుంచి రూ.24.60 లక్షలతో మూడు మహాప్రస్థాన వాహనాలను సమకూర్చడం అభినందనీయమన్నారు. ఏలూరు జిజిహెచ్‌తోపాటు ఏరియా ఆసుపత్రులైన జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు ఏరియాల పరిధిలో నిరుపేదలకు మరణాలు సంభవిస్తే వారి మృతదేహాన్ని వారి ఇంటికి పంపించడానికి ఎటువంటి సొమ్ము చెల్లించకుండా ఉచితంగా వాహన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల పొరుగు సేవలు, కాంట్రాక్టు ఉద్యోగుల, గ్రామ వార్డ్ సచివాలయ ఉద్యోగుల సమస్యలు, వారి డిమాండ్ల పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ నిర్ణయం ప్రకారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని, 2022 నుంచి రావాల్సిన డిఎ చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పొరుగు సేవ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని మాట ఇచ్చి, నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ సిపిఎ రద్దు ఊసే ఎత్తడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎపిజెఎసి అమరావతి పక్షాన ప్రభుత్వం ముందు ఉంచిన అనేక ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ధర్నాకు ముఖ్య అతిథిగా రాజు, ఎపిజెఎసి అమరావతి అసోసియేట్ ఛైర్మన్, శ్రీనివాస్, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కో-ఛైర్మన్, సంఘీభావంగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఎపిఎన్‌జిఒ నాయకులు చోడగిరి శ్రీనివాస్, ఎ.ప్రమోద్‌కుమార్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, జిల్లా కార్యదర్శి, ఎన్‌జిఒ నాయకులు, మహాలక్ష్మి పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, పెన్షనర్లు, ట్రేడ్ యునియన్ నాయకులు ఎపిజెఎసి అమరావతి సభ్య సంఘం నాయకులు, వివిధ సంఘాల కార్యదర్శులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

మాకినేని బసవపున్నయ్యకు నివాళి

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం అగ్రనాయకుడిగా, మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడిన కమ్యూనిస్టు యోధుడు మాకినేని బసవపున్నయ్య వర్ధంతి కార్యక్రమం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపి ఎం నగర నాయకులు వి.సాయిబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. బసవపున్నయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ 1930లో స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకొని, 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరారని తెలిపారు. తొలుత విద్యార్థి సంఘం నాయకునిగా, గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా, 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయినప్పుడు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 1952 నుంచి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా తన ప్రస్థానం కొనసాగించారన్నారు. సిపిఐ(ఎం) పీపుల్స్ డెమోక్రసీ పత్రికకు సంపాదకులుగా కూడా పని చేశారని తెలిపారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో సుందరయ్య వంటి నాయకులతో కలిసి పాల్గొన్నారన్నారు. ఆయన జీవితాంతం మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి పీడిత ప్రజల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడిన వ్యక్త అని కొనియాడారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి సిపిఎం నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద, కార్పోరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టా లంటే మార్క్సిస్టు దృక్పథంతో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పి.ఆదిశేషు, కె.విశ్వనాథం, జె.గోపి, కె.లెనిన్, జి.కోటేశ్వరరావు, ఎం.జస్సాకు, ఎం.సత్యం, సిహెచ్.పైడియ్య, ఆర్,నరసింహమూర్తి పాల్గొన్నారు.

మండవల్లిలో జిల్లా అధికారుల పర్యటన

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మండవల్లి

చెత్త ఉన్నది సంపద తయారు చేసుకోవడాకే గాని తగలబెట్టేందుకు కాదని డిపిఒ జివి.మల్లికార్జునరావు స్పష్టం చేశారు. చెత్త రహదారులు, రోడ్డుపై చెత్తకు నిప్పు.. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు శీర్షికలతో ప్రజాశక్తిలో వరుసుగా మంగళవారం, బుధవారం ప్రచురితమైన కథనాలకు జిల్లా అధికారులు స్పందించి మండవల్లిలో చెత్తకుప్పలను బుధవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై చెత్త కుప్పలు ఉండకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. అంతేకాకుండా రహదారులపై చెత్త కనిపిస్తే బాధ్యులైనఅధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరికలు కూడా జారీ చేశారని అన్నారు. సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించుకుని రోడ్లపై చెత్త వేయడం సరైన పద్ధతి కాదన్నారు. సంపద కేంద్రాన్ని వారం రోజుల్లో వినియోగంలోకి తీసుకొచ్చి సంపద తయారు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం చెత్తను తగలపెట్టకూడదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శులపై చర్యలు తీసుకుంటూనే ఉన్నామన్నారు. మండల కేంద్రమైన మండవల్లిలో ఆక్రమణ గురైన పంచాయతీ స్థలాలను గుర్తించి ఖాళీ చేయించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి రాధిక పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో డిపిఒ మల్లికార్జునరావు

కార్యదర్శి శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీస్

మండవల్లి వద్ద జాతీయ రహదారిపై చెత్త కుప్పలను తగలబెట్టేయడంతో జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారన్నారు. దీంతో విధులు సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శి తోట శ్రీనివాసరావుకు హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. చెత్తను సంపద కేంద్రానికి తరలించి సంపద సమకూర్చేలా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి చెత్తను తగలబెట్టేసిన కార్యదర్శి తోట శ్రీనివాసరావుపై చర్యలు తీసుకునే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోకాజ్ నోటీసులు జారీ చేశామని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న డివిఎస్‌విడి.ప్రసాద్

కృష్ణమూర్తి మృతి తీరని లోటు


ప్రజాశక్తి - ముదినేపల్లి

సిపిఎం దేవపూడి గ్రామ నాయకులు బోయిన కృష్ణమూర్తి సేవలు మరువలేనివని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డివిఎస్‌విడి.ప్రసాద్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బోయిన కృష్ణమూర్తి సంస్మరణ సభ మండలంలోని దేవపూడిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద బుధవారం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఉల్లంకి నాంచారయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో బోయిన కృష్ణమూర్తి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం జరిగిన సభలో ప్రసాద్ మాట్లాడుతూ అధికారమే పరమావధిగా కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేసే సిపిఎంలో దీర్ఘకాలం ఆయన పనిచేయడం చాల గొప్ప విషయమన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ స్వార్థం లేకుండా 37 సంవత్సరాల పాటు విప్లవకర పార్టీలో సభ్యునిగా కొనసాగడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శేషపు మహాంకాళిరావు, ఉల్లంకి సీతమ్మ, దండుబోయిన త్రిమూర్తులు, మట్లాపూడి కనకరావు, ఆలపాటి కుటుంబరావు, చిన్నం మాధవ, పాతపాటి జ్ఞానేష్, గోసంగి వినోద్, పంతగాని ప్రకాష్, బోయిన రాంబాబు, పి.యాకోబు, గంటా సోమయ్య, చిన్నం శ్రీకాంత్, అనగాని శ్రీరామమూర్తి, సానుభూతిపరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామాభివృద్ధికి మూలమైన గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బుధవారం మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు ఈ సభలు జరుగుతాయన్నారు. ఈ గ్రామ సభల్లో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆమె తెలిపారు.



బాధితులకు సాయం అందిస్తున్న ఆకుమర్తి రామారావు

బాధితులకు ఆకుమర్తి రామారావు సాయం

ప్రజాశక్తి - కామవరపుకోట

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, సామగ్రి, దుప్పట్లు, చీరలు, రూ. పదివేల ఆర్థిక సాయం అందించి టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు ఔదార్యం చాటుకున్నారు. కామవరపుకోట మండల కేంద్రం కాలేజ్ రోడ్డులోని కొప్పిశెట్టి సత్యవతి ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో సత్యవతి ఇంట్లో సామగ్రి అంతా కాలి బూడిదైంది. ఈ క్రమంలో బాధితుల వివరాలను మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ, టిడిపి కామవరపుకోట మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ ద్వారా తెలుసుకున్న ఆకుమర్తి రామారావు బాధిత కుటుంబానికి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వజీర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి పరసా శ్రీనివాసరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, మండల బిసి సెల్ అధ్యక్షుడు దొడ్డా కుల గంగాధరరావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కరిపోతు కృష్ణ, ప్రచార కార్యదర్శి బొబ్బిలి డాన్ దివాకర్ పాల్గొన్నారు.

వాలంటీర్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బంధంచర్ల గ్రామ వాలంటీర్ షేక్ రజ్విన్ బేబిని పలువురు అభినందిస్తున్నారు. బంధంచర్ల గ్రామానికి చెందిన అనుమోలు రాజేశ్వరికి ప్రభుత్వం అందిస్తున్న రూ.15వేలు ఇబిసి నేస్తం పథకం మంజూరు కావడంతో ఆమె వేలిముద్ర వేయాల్సి ఉంది. ఆమె ఇటీవల అనారోగ్యంతో తెలంగాణా రాష్ట్రం హైదరాబాదులో ఉంటోంది. గ్రామానికి రాలేని పరిస్థితిలో జిల్లా రైతు అధ్యక్షులు వాసిరెడ్డి మధు సూచనలు మేరకు వాలంటీర్ రజ్విన్ హైదరాబాద్ వెళ్లి రాజేశ్వరితో వేలిముద్ర వేయించింది. దీంతో వాలంటీర్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ట్రస్టుకు వెలగలేరు వాస్తవ్యులు టివివి.సత్యనారాయణరెడ్డి బుధవారం ఉదయం రూ.51,116 విరాళం దేవస్థానం సూపరింటెండెంట్ ఐ.రమణరాజుకు అందించారు. దీపక్ నెక్స్‌జెన్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీవారు స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.8 లక్షల విరాళం చెక్కును దేవస్థానం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందించారు. అనంతరం ఇరువురి దాతల కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్ అందించారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం : జనసేన

ప్రజాశక్తి - వేలేరుపాడు

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు అన్నారు. జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా వేలేరుపాడు మండలంలో బుధవారం ఇంటింటికి జనసేన మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ మేనిఫెస్టోలో ప్రజల కష్టాలకు తగిన పరిష్కారం జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయడమేనని, జనసేన పార్టీ అధికారంలో లేకపోయినా చేసిన సేవా కార్యక్రమాలు, అధికారంలోకి రాగానే చేసేటువంటి పథకాలు రూపొందించామని తెలిపారు. జనం కోసం జనసేన కార్యక్రమం 67వ రోజు మండలంలోని తూర్పుమెట్ట, కొత్తూరు, వేలేరుపాడు పంచాయతీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలలో జనసేన పార్టీని గెలిపించుకుంటే ప్రజల కష్టాలను తీరుస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేసుల ఆదినారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వల్లంపట్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని గండిగూడెం గ్రామానికి చెందిన ఎస్.ఆంజనేయులు (22) వల్లంపట్ల గ్రామంలోని రైతు తోటలో కొబ్బరి కాయలు లోడు చేసే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో ఆంజనేయులు లోడు చేస్తూ వ్యాన్‌పై కూర్చున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతునికి 11 నెలల క్రితం వివాహమైంది. మృతుని భార్య ప్రియాంక ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - మండవల్లి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండవల్లి సచివాలయ సిబ్బందికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి రాధిక తెలిపారు. ఏలూరు జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి జి.రమణ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ అధికారి రమణ మండవల్లి సచివాలయాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది విధివిధానాలను నిర్వహిస్తున్న రిజిస్టర్లను ఆయన పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం, యూనిఫారం ధరించకపోవడం ఆయన గమనించారన్నారు. ఈ విషయంపై ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సచివాలయ సిబ్బందికి హెచ్చరికలు కూడా జారీ చేశారన్నారు. అనంతరం ఇంజినీర్ సహాయకులు పిఎస్.శ్రీనివాసప్రసాద్, సర్వే సహాయకులు ఎన్.మహేంద్ర బాబు, మహిళా పోలీస్ సి.శ్రీలలిత గాయత్రికి నోటీసులు జారీ చేశారని ఆమె తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధ్యాయులు విద్యాబోధనకే పరిమితం కాక తమ వద్ద చదువుకుంటున్న విద్యార్థుల సంక్షేమానికి, విద్యాభ్యాసం కొనసాగించటానికి అవసరమైన సహాయ సహకారాలతో పాటు ఆర్థిక సహాయాన్ని సైతం అందించేందుకు సిద్ధంగా ఉంటారని ఏలూరు జిల్లాకు చెందిన కొందరు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ తరహా సంకల్పం గల కొందరు ఉపాధ్యాయులు శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ పేర స్వచ్ఛంద సంస్థను ఏలూరు కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు. దీనిలో సభ్యులుగా నమోదైన ఉపాధ్యాయులు ప్రతినెల కొంత మొత్తాన్ని సంస్థ నిధికి జమ చేస్తుంటారు. ఈ విధంగా సిద్ధం చేసిన నిధి నుంచి విద్యార్థులను ఆదుకునేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ తరహాలో పలు కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ సభ్యులు తాజాగా భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన జోగినిడి యశ్వంత్‌ను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సదరు విద్యార్థికి రూ.పదివేల ఆర్థిక సాయాన్ని గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జి.మోహన్, సంస్థ సభ్యులు గుంటూరు శ్రీనివాసరావు, గంజి రాజు, సనపల రాంబాబు, సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

భూసార పరీక్ష, మట్టి నమూనా సేకరణపై కార్యాలయంలో మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెడిఎ విద్యాసాగర్ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం ఫలితాలు రైతులకు తెలపాలన్నారు.

ఉంగుటూరు : వ్యవసాయ పొలాల్లో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మట్టి నమూనాలను సేకరించాలని మండల వ్యవసాయాధికారి బాలిన వెంకటేష్ అన్నారు. ఉంగుటూరు రైతు భరోసా కేంద్రంలో విఎఎ, విహెచ్ఎలకు మట్టి నమూనా సేకరణపై అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహించారు. 5.25 ఎకరాల్లో ఒక మట్టి నమూనా తీయాలన్నారు. అలా తీసిన మట్టిని గొల్లపూడిలో భూసార పరీక్షా కేంద్రానికి పంపి వాటి ఫలితాలను రైతులకు వివరించి మందులు, ఎరువులు విచక్షణా రహితంగా వాడకుండా కాపాడవచ్చని వివరించారు

చాట్రాయి : భూసార పరీక్షలు, మట్టి నమూనా సేకరణపై చాట్రాయి మండల వ్యవసాయాధికారి బి.శివశంకర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారులకు భూసార పరీక్షల కోసం మట్టి ఎలా సేకరించాలనే దానిపై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకుని దానికి అనుగుణంగా వ్యవసాయం చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : భూసార పరీక్షలు నిర్వహించి పంటలు పండిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఎడిఎ పి.లలిత సుధ తెలిపారు. మండలంలోని ముసునూరు గ్రామంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం భూసార పరీక్షలు నిర్వహించారు. రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.

ముక్కొల్లుపాడులో రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ముక్కొల్లుపాడు గ్రామంలో రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. రైతులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలగర వెంకటేశ్వరరావు, సర్పంచి కంచర్ల సుబ్బలక్ష్మి, ఎడిఎ విద్యాసాగర్, ఎఒ చాముండేశ్వరి, ఎంపిడిఒ సుందరి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆపన్న హస్తం

ప్రజాశక్తి - వేలేరుపాడు

ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కన్నాయిగుట్ట, టేకురు గిరిజన గ్రామాల్లో 32 కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యాయి. ఆదివాసీ మహాసభ టీమ్ సభ్యులు మోతుకు రాంబాబు తమకు అనుబంధంగా ఉన్న అలెర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు విషయాన్ని తెలిపారు. మానవతా దృక్పాథంతో స్పందించిన స్వచ్ఛంద సేవా సంస్థ వారు బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు, నిత్యావసర వస్తువులు, సరుకుల రూపంలో దాదాపు ఒక్కో కుటుంబానికి రూ.3500 విలువైన వస్తువులను తహశీల్దార్ చల్లన్న దొర, సర్పంచులు కట్టి ఉదయ్‌కిరణ్, సోడే విజయ, ఎంపిటిసి సభ్యులు రత్తమ్మ చేతులమీదుగా బుధవారం అందించారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న తహశీల్దార్

ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహాసభ టీమ్ సభ్యులు మీడియం వెంకటస్వామి, కారం వెంకటేష్, అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు యాకూబ్, రాంబాబు, వెంకటేష్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలి



ప్రజాశక్తి - కలిదిండి

గ్రామాల్లో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి జిడికె.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో గుర్వాయిపాలెం, భాస్కరరావుపేట, తాడినాడ, కలిదిండి, పడమటిపాలెం, ఆవకూరు, కొండంగి, సానారుద్రవరం గ్రామాలను పూర్తి శానిటేషన్, రెవెన్యూ జనరేషన్ పెంపొందించేలా మొదటి దశలో కలెక్టర్ ఆదేశించారన్నారు. పన్నులు తదితర వసూళు ఐదు రోజుల్లో పూర్తి చేసి ట్రెజరీలో జమ చేయాలన్నారు. 2022-23 ఏడాది జమ ఖర్చులు అందించాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లోని మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపాలన్నారు. అనంతరం గుర్వాయి పాలెంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను పరిశీలించారు. డిడిఒ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఐసిఎం సంఘాల 122వ జనరల్ కన్వెన్షన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్థానిక అల్ సెయింట్స్ ఐసిఎం చర్చి కథెడ్రల్ ప్రాంగణంలో ఐసిఎం సంఘాల 122వ జనరల్ కన్వెన్షన్ 11, 12 తేదీల్లో అగ్రపీఠాధిపతులు బిషప్ జాన్ తండ్రి ఆధ్వర్యంలో వేడుకగా జరిగాయి. సభలకు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇతర దేశాల్లో కూడా ఇండియా పేరుతోనే ఐసిఎం సంఘం విస్తరించబడడం అద్భుతమని జాన్‌వెస్లీ అన్నారు. సంఘం అగ్ర పీఠాధిపతులు బిషప్ జాన్ నాయకత్వంలో ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మరొక అతిథి స్టేట్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ దయాల నవీన్‌బాబు మాట్లాడుతూ ఐసిఎం సంఘ కార్యక్రమాలను తమ వంతు సహకారం అందించగలనన్నారు. వేలాది మంది పాల్గొన్న ఈ సభల్లో ప్రముఖ క్రైస్తవ వేదాంతి డాక్టర్ మృత్యుంజయ, ఎఐసిసి స్థాపక అధ్యక్షులు రెవ గెరా హనోక్ ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల్లోని ఐసిఎం సంఘాల బిషప్‌లు పశ్చిమ బెంగాల్ బిషప్ అగస్టిన్ సుకుమార్, తెలంగాణ బిషప్ కొండూరి డేనియల్, పంజాబ్ వెరీ రెవ శాంసన్, రెవ రత్న జాయ్ రియాంగ్, త్రిపుర బిషప్ బ్రదర్ డెస్మండ్, ఉత్తరాఖండ్, బిషప్ తల్లి నక్కా రోజీ జాన్, ఉపాధ్యక్షులు డాక్టర్ జాన్‌లియో పాల్గొన్నారు. కృష్ణా -గోదావరి డియోసిస్ ట్రెజరర్ వెరీ రెవ యేసురత్నం, సెక్రటరీ ఎన్‌వై వి.ప్రసాద్, సభ్యులు టి.అషయ్య, ఆర్.రవికుమార్, సిహెచ్.జాకబ్‌రాజు, తెనాలి యోహాను, డీనరీ ఛైర్మన్లు రెవ మైఖేల్, రెవ దేవసహాయం, రెవ ఏసుపాదం, పరిశుద్ధ ఆంద్రే య బైబిల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెవ యోబు, సంఘ కాపరులు, విశ్వాసులు కృష్ణా గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఏలూరు పట్టణంలో దైవ సేవ చేస్తున్న ఏలూరు పాస్టర్ల అసోసియేషన్, కౌన్సిల్, ఫెడరేషన్ల అధ్యక్షులు రెవ జిపి.ఆశీర్వాదం, రెవ.ఎబినెజర్ శాస్త్రి, రెవ జీవన్ కుమార్, పాస్టర్ పివి.రాజును ఈ సభల్లో సత్కరించారు.

ఏలూరులో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ద్వారా జిల్లా గవర్నర్ డాక్టర్ వికె పంకజాక్షన్ అధికార పర్యటన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయం గోసంరక్షణాలయం వద్ద గోవులకు ఆహారాన్ని మురళీకృష్ణ వారి ఆర్థిక సాయంతో పంపిణీ చేశారు. ప్రెసిడెంట్ అబ్రహాంలింకన్ ఆర్థిక సాయంతో వారి గృహం వద్ద 40 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోణంగి పాఠశాల ఆవరణలో ట్రేస్ ఇండియా ఛైర్మన్ యాంజిలో దిడ్ల వారి ఆర్థిక సహకారం రూ.1.30 లక్షలతో చేయించిన కాంక్రీట్ గచ్చును వికె పంకజాక్షన్ ప్రారంభించారు. పోణంగి గ్రామస్తులకు, విద్యార్థులకు కంటి పరీక్షించి 19 మందికి స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆర్థిక సాయంతో కళ్లజోళ్లు వికె పంకజాక్షన్ చేతులమీదుగా పంపిణీ చేశారు. జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి పూలే, అంబేద్కర్‌పై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు. పోణంగి ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ఎంఆర్ఆర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు రీడింగ్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా విజిఎంవిఆర్.కృష్ణారావు ఆర్థిక సహకారంతో 35 పుస్తకాలను ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం వారు నడుపుతున్న ట్యూషన్ సెంటర్స్‌కు రీడింగ్ యాక్షన్ కార్యక్రమం అనుసరించి మూడు సెట్ల గ్రంథాలయ పుస్తకాలను అందించారు. ప్రభుత్వ ఐటిఐ జిల్లాస్థాయి శిక్షణా కేంద్రానికి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అబ్రహాంలింకన్ తండ్రి జ్ఞాపకార్థం ఎల్‌సిడి ప్రొజెక్టర్ పంపిణీ చేశారు. సత్రంపాడు పాత పెట్రోల్ బంకు దగ్గరలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ సమావేశం ఏర్పాటు చేసి 2022 జులై నుంచి ఇప్పటివరకు చేసిన పలు సేవా కార్యక్రమాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా నాయుకులు వివి.స్వామి, లేళ్ల వెంకటేశ్వరరావు, జోన్ ఛైర్మన్ ఎన్.నాగమల్లేశ్వరరావు, జిల్లా ఛైర్మన్ మురళీకృష్ణ, ప్రెసిడెంట్ అబ్రహాంలింకన్, కార్యదర్శి మార్గాని శ్రీనివాసరావు, కోశాధికారి షేక్ ముస్తఫా అలీ, సభ్యులు బి.సురేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు, ఉపాధ్యాయులు కె.దేవీప్రసాద్, సిజెఎ స్టీవెన్, జిఎ.స్వామి, గోపాల్ గణేష్, కె.శ్యామలాదేవి, కృష్ణవేణి, సంతోషమ్మ, సుధారాణి, శ్రీనివాస్, జాన్‌వెస్లీ, జె.పెంటయ్య పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు శిక్షణ

కలిదిండి : స్థానిక వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ (పాలిసెట్) ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డిఎస్‌విఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి మే ఎనిమిదో తేదీ వరకు జరిగే శిక్షణ తరగతులను పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే పదో తేదీన జరిగే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసేందుకు ఏప్రిల్ 30 ఆఖరి గడువని తెలిపారు.

నేడు భూ సదస్సు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో ఈ నెల 13న నిర్వహించే భూ సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఈపూరి రవీంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు, అప్పికట్ల రవి, పిల్లి రామకృష్ణ, పిల్లి మురళి, చాకిరి శివనాగరాజు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల మండలంలోని మైసన్నగూడెంలో దాడికి గురై మృతి చెందిన తోణం శివ కుటుంబాన్ని ఎంఎల్ఎ ఎలిజా బుధవారం పరామర్శించారు. తోణం శివ అతని భార్య చిన్ని మృతి చెందగా వారి కుమారుడు మంగరాజు గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వీరి దీన స్థితి తెలుసుకున్న ఎంఎల్ఎ వైద్యానికి అయ్యే ఖర్చు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో శివ సోదరుడు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన సంఘటనను బంధువులు ఎంఎల్ఎ ఎలిజా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఎల్ఎ ఎలిజా స్పందిస్తూ ఇరువురి కుటుంబాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సంకర్షణపురం, వడాలి, గురజ, పెనుమల్లి, సింగరామయపాలెం, విశ్వనాద్రిపాలెం పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశం ప్రజలకు వివరించి జగనన్నకు మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య, మోట్రు ఏసుబాబు , శీలం రామకృష్ణ, బొర్రా శేషుబాబు పాల్గొన్నారు.

ముసునూరు : మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మండలంలోని లోపూడి గ్రామంలో సర్పంచి పేర కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడారు. గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికి వెళ్లి స్టీకర్లు అంటించినట్లు వైసిపి లోపూడి అధ్యక్షులు బి.నరసింహారావు తెలిపారు.